సాక్షి
పెద్దపల్లి

మంగళవారం । 30 । మే । 2023



పచ్చిరొట్టకు సమయమిదే..

రోహిణికార్తె ప్రవేశించింది. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో జిల్లాకు చెందిన రైతులు వానాకాలం పంటలకు సన్నద్ధం అవుతున్నారు. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.6,808

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,808 పలికింది. కనిష్టంగా రూ.6,311, మోడల్ రూ.6,632గా నిర్ణయించినట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
39.0/29.0

వాతావరణం

వాతావరణం ఉదయం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం



ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ

రామగుండం: ఆబాది రామగుండంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ధ్వజస్తంభ స్థిర ప్రతిష్ఠాపన శిఖర సంప్రోక్షణ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 31 వరకు జరిగే వేడుకల్లో మొదటి రోజు ఆలయ ప్రాంగణంలో అఖండ దీపారాధణ, గణపతి పూజ, పుణ్యహావచనం, నవగ్రహ పూజ, అగ్ని స్థపనం తదితర విశేష పూజాక్రతువులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పార్టీ బలోపేతానికి యువత ముందుకురావాలి



యూత్ అధ్యక్షుల జాబితా ప్రకటిస్తున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్

రామగుండం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం యువత నిరంతరం శ్రమించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని గ్రామాలవారీగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల జాబితాను ప్రకటించారు. అంతర్గాం యూత్ ప్రధాన కార్యదర్శిగా ఆలకుంట రాజేశం, ఉపాధ్యక్షుడిగా దొబ్బల తరుణ్‌కుమార్, కార్యదర్శిగా వేముల సతీష్, పట్టణ అధ్యక్షుడిగా ఆలకుంట సంజీవ్, పెద్దంపేట యూత్ అధ్యక్షుడిగా మహేశ్, ముర్మూర్ అధ్యక్షుడిగా పెసరి ఉరేష్, ఎల్లంపల్లి అధ్యక్షుడిగా గుమ్మల ప్రశాంత్, మద్రిపల్లి అధ్యక్షుడిగా అజయ్, బ్రాహ్మణపల్లి ఉపాధ్యక్షుడిగా జాడి ప్రశాంత్, కార్యదర్శిగా వంశీ, ఎగ్లాస్‌పూర్ అధ్యక్షుడిగా అజయ్, పొట్యాల అధ్యక్షుడిగా మస్కం భాస్కర్, ఆకెనపల్లి అధ్యక్షుడిగా నరేష్, గోలివాడ అధ్యక్షుడిగా గాదం కుమార్, సోషల్ మీడియా సభ్యులుగా చిలుక మనోజ్, ఆలకుంట అనిల్‌ను నియమించారు.

భూమిపూజ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

మంథని: కొమురవెల్లిలో శ్రీమల్లికార్జున స్వామి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణానికి ఈనెల 31న చేపట్టే భూమిపూజ వాల్ పోస్టర్‌ను సోమవారం మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆవిష్కరించారు. మున్నూరుకాపుల ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు. భూమిపూజకు మున్నూరుకాపు కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, తదితరులు ఉన్నారు.

'ఖని'లో సివిల్ సొసైటీ ఫోరం ఆవిర్భావం



సొసైటీ ఫోరం సభ్యులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలో వివిధ రంగాలకు చెందిన 70 మంది ప్రముఖులు సామాజిక సేవా సంకల్పంతో సివిల్ సొసైటీ ఫోరంను ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక రెడ్డి భవన్‌లో తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సొసైటీ ఫోరం రెండేళ్లకుగాను గౌరవ అధ్యక్షుడిగా బల్మూరి అమరేందర్‌రావు, అధ్యక్షులుగా మల్లావజ్జుల వంశీ, విద్యానంద్, ఉపాధ్యక్షులుగా ముచ్చకుర్తి చంద్రమౌళి, బాలసాని స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా తూముల అశోక్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ముడుతనపెల్లి సారయ్య, కంకణాల ముకుందరెడ్డి, కోశాధికారిగా లక్కం భిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పొన్నం విజయ్‌కుమార్‌గౌడ్ నియామకం అయ్యారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి వద్ద మానేరు వాగులో అసంపూర్తిగా నిర్మించిన చెక్‌డ్యాం. ఈ చెక్‌డ్యాం నిర్మాణం కోసం దాదాపు రూ.20 కోట్లు వెచ్చించనున్నారు. రెండువైపులా గోడ నిర్మించి.. మధ్యలో పునాది పటిష్టం చేసే పనులు మధ్యలోనే వదిలేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేటలో నిర్మించిన చెక్‌డ్యాం. గతేడాది వర్షాలతో కరకట్టలు తెగిపోయాయి. దీంతో పరీవాహక ప్రాంతాల్లోని పంట భూములు నీటమునగడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.

ఆగుతూ.. సాగుతూ..!

- చెక్‌డ్యాంలు పూర్తయ్యేదెప్పుడో..!?
- వేసవిలో పూర్తయితే మేలంటున్న అన్నదాతలు



కాల్వశ్రీరాంపూర్‌లో హుస్సేన్‌మియా వాగుపై కొట్టుకపోయిన చెక్‌డ్యాం

సాక్షి, పెద్దపల్లి: భూగర్భ జలమట్టాలను పెంపొందించి తద్వారా సాగునీటి లభ్యత మెరుగుపరిచేందుకు సర్కారు ఆనకట్ట (చెక్‌డ్యాం)ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నిధులు సమకూర్చి ఏళ్లు గడిచినా.. పూర్తికాక నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోతోంది. ఏటా వర్షాకాలంలో మానేరు డ్యాం నుంచి కిందకు వచ్చే సుమారు 10 టీఎంసీల జలాలు వృథాగా గోదావరిలో కలుస్తున్నాయి. అధికారులు సకాలంలో పూర్తిచేస్తే వరదనీటిని బడిసిపట్టే ఆస్కారం ఏర్పడుతుంది. సాగుకూ ఉపయోగపడుతుందని అన్నదాతలు అంటున్నారు.

రూ.234కోట్లతో 21 చెక్‌డ్యాంలు

జిల్లాలో ప్రవహించే మానేరు వాగుపై 16, హుస్సేన్‌మియా వాగుపై 5 కలిపి మొత్తం 21 చెక్‌డ్యాంలను రూ.234 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. ఓదెల, సుల్తానాబాద్, మంథని, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో వీటిని నిర్మించడానికి 2019లో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో కొన్ని నిర్మాణాలు పూర్తిచేసుకున్నా నాణ్యత, నిర్మాణ లోపాలతో గతేడాది కురిసిన వానలకు కొట్టుకుపోయాయి. మిగితా చోట్ల నిర్మాణ పనులు ఆగుతూ సాగుతున్నాయి. కొట్టుకపోయిన పునాది పనులను తిరిగి ప్రారంభిస్తున్నారు. జూన్ గడువులోగా అధికారులు పూర్తిచేస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పనులు భిన్నంగా ఉన్నాయి. చేపట్టిన సగం నిర్మాణాలు సైతం గతేడాదిలాగే కొట్టుకుపోయే అవకాశముందని అన్నదాతలు అంటున్నారు. ఇసుక, కంకర, సిమెంట్ వాడకంలో ప్రమాణాలు పాటించకుండా.. వేసవిలో నిర్మించాల్సిన చెక్‌డ్యాంలను వానాకాలంలో చేపట్టడం ద్వారా కొట్టుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు ఇసుక రీచ్‌లు కూడా చెక్‌డ్యాంలకు సమీపంలోనే తవ్వుతున్నారు. పైనుంచి వచ్చే వరదనీటి అంచనా ఆధారంగా.. రీడిజైన్‌తో సాంకేతిక సమస్యలు అధిగమించి నిర్మాణాలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాలు పెరగుతాయని ఆశిస్తున్న రైతులు పనుల జాప్యంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. దీనిపై నీటిపారుదలశాఖ అధికారుల వివరణ కోరగా చెక్‌డ్యాంల నిర్మాణ పనుల్ని వేగంవంతం చేసేలా ఆదేశించామని, రైతులకు సాగు నీరు పుష్కలంగా ఉండేలా చూస్తామని తెలిపారు.

నాలుగెకరాలు కొట్టుకుపోయింది



కాల్వశ్రీరాంపూర్‌లో హుస్సేన్‌మియా వాగుపై కట్టిన చెక్‌డ్యాం నాణ్యత లోపం కారణంగా వర్షాలకు కొట్టుకుపోయింది. నా నాలుగున్నర ఎకరాలు నాటు వేశాక చెక్‌డ్యాం కట్ట తెగి పొలమంతా కోతకు గురైంది. పొలం నామరూపాలు లేకుండాపోయింది. 60 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నయా పైసా ఇవ్వలేదు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని చెక్ డ్యాం పునర్నిర్మాణం చేపట్టాలి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. – రమేశ్, రైతు, కాల్వశ్రీరాంపూర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న పెద్దపల్లి, మంథని ఆర్డీఓలు

ప్రజావాణిలో సమస్యల నివేదన

- 66 దరఖాస్తులు స్వీకరించిన ఆర్డీఓలు

పెద్దపల్లిరూరల్: సమస్యలపై సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి పాటుపడేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అర్జీలతో కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులకు అర్జీలు అందిస్తున్నారు. తాజాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పెద్దపల్లి, మంథని ఆర్డీఓలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 66 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 49దరఖాస్తులు రెవెన్యూ సంబంధమైనవే కావడం గమనార్హం. 17 దరఖాస్తులు ఇతర శాఖలవని అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకంలో విధిస్తున్న కోతలను ఆపాలని, మిల్లుల వద్దకు రైతులు వెళ్లకుండా కేంద్రాల వద్దే ట్రక్‌షీట్ అందించేలా చూడాలని సీపీఎం నాయకులు అశోక్, రవీందర్, ప్రశాంత్, నవీన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భూమి ఆన్‌లైన్‌లో చూపుతలేరు



మాకున్న భూమికి కొత్త పాసుబుక్కు ఇచ్చిండ్రు. ఆ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తలేవు, రైతుబంధు పథకం కింద పైసలు పడుతలేవు. చాలాసార్లు అధికారులను కలిసినం. ఆన్‌లైన్ అయితదని అంటుండ్రు. ఇప్పటిదాకా కాలే. మాకు రైతు బంధు వచ్చేలా చూడాలె. – పుట్టల మల్లమ్మ, కొత్తపల్లి, పెద్దపల్లి మండలం

ఆరేళ్లుగా తిరుగుతన్న



మాకు ఇరవైగుంటల భూమి ఉంది. మాకు పాసుపుస్తకం కూడా ఇచ్చిండ్రు. మొఖామీద 13గుంటలే ఉంది. ఏడు గుంటల భూమి తక్కువగా ఉంది. హద్దులు చూపాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్న. ఇప్పటివరకు న్యాయం జరగలే.
– మండల మొండయ్య, లలితపల్లి, ఎలిగేడు

కలెక్టరమ్మను కలవాలని వచ్చా



నేను సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యా. నాకున్న ఆస్తినంతా ఇద్దరు కొడుకులకు పంచిన. 12 ఏళ్ల క్రితం నా భార్య రాజమణి చనిపోయింది. పెద్ద కొడుకు పట్టించుకుంటలేడని కలెక్టర్‌ను కలిసిన. నెలకు రూ.4వేలు ఇవ్వాలని ఆర్డర్ ఇస్తానని ఈనెల 6న కలెక్టర్ చెప్పారు. అధికారులు ఇంకా ఇయ్యలే. కలెక్టరమ్మను కలవాలని వచ్చిన.
– కొండ్ల జనార్దన్, కల్వచర్ల

భూమి రికార్డుల్లో మాయమైంది



నాకు మూడు సర్వే నంబర్లలో భూమి ఉంది. కొత్త పాసుపుస్తకం ఇచ్చేటపుడు మూడు నంబర్లలో కలిపి 1.10 గుంటల భూమి తక్కువగా రాసిండ్రు. ఆ భూమి ఇతర వ్యక్తుల పేరిట ఎట్ల చేసిండ్రని మండల అధికారులు, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన. ఇప్పటికీ సరి చేసి న్యాయం చేయడం లేదు.
– ఎంబాడి రాజేశం, ఓదెల

పండుగలా దశాబ్ది ఉత్సవాలు

- రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగలు
- కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్, డీసీపీ, అధికారులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఆవిర్భవించి పదో ఏట అడుగిడుతున్న సందర్భంగా దశాబ్ది వేడుకలను పండుగలా జరుపుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. సోమవారం కలెక్టర్లు, ఇతర అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్2నుంచి 22వరకు నిర్వహించే దశాబ్ది వేడుకల్లో రాష్ట్ర ప్రగతి ప్రతిబింబించాలని, రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండగల నిర్వహణపై శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. రైతు వేదికల్లో రైతు దినోత్సవం జరపాలన్నారు. చెరువుల వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల నిర్వహణలో పారిశుధ్య కార్మికులను సత్కరించాలన్నారు.

జిల్లాలో ఘనంగా ఏర్పాట్లు

దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సంగీత అన్నారు. జూన్ 2న అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని శాఖల ప్రగతిని వివరిస్తామన్నారు. రైతుదినోత్సవం రోజు రైతులకు సాదరస్వాగతం పలుకుతామని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు పెడతామని తెలిపారు. జూన్9న మలివిడత గొర్రెల పంపిణీ చేపట్టేందుకు గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఈఓ మాధవి, డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీఓ ఆదిరెడ్డి, డీఎఫ్‌ఓ శివయ్య, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను నిండా ముంచుతున్నరు



కాల్వశ్రీరాంపూర్: మాట్లాడుతున్న గుజ్జుల

పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్: మద్దతు ధర వస్తదనే ఆశతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతులను అధికారులు, ప్రజాప్రతినిధులు దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బీజేపీ నాయకుడు కౌశిక హరి, మీస అర్జున్‌రావు, ఠాకూర్ రాంసింగ్ తదితరులతో కలిసి జిల్లాకేంద్రంలో మాట్లాడారు. ముందుగా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం, మంగపేట గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం కొన్నవెంటనే ట్రక్‌షీట్ ఇవ్వకుండా మిల్లర్లతో ములాఖత్ అయి మరోసారి కోత పెడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, తూకం, మిల్లర్ల కోతలను నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట కిసాన్ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు పిన్నింటి రాజు, పర్శ సమ్మయ్య, రమేశ్, ఆదికేశవరావు, ఫహీం, కుమార్, రవి, రవీందర్‌రెడ్డి, రామన్న, సంపత్‌రెడ్డి తదితరులున్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్షించారు. 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. మరణించిన, వలసవెళ్లిన ఓటర్ల పేర్లు తొలగించాలని పేర్కొన్నారు. ఆగస్టు 2నుంచి 31వరకు కొత్తగా పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి, ఎలక్షన్ డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

శ్రీభక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 30 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

'కట్టా'పై సస్పెన్షన్ వేటు..!

- కట్టా విష్ణువర్ధన్ నియామకం, విద్యార్హతలపై ఆరోపణలు
- సస్పెన్షన్ ఉత్తర్వులను స్వయంగా అందజేసిన ఏఈ
- సర్వీస్ రిమూవల్, సాలరీ రికవరీకి డిమాండ్
- 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడని వెల్లడి

'సాక్షి' కథనాలపై స్పందించిన ఈఎన్‌సీ



కట్టా విష్ణువర్ధన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్)శాఖలో కలకలం రేగింది. విజిలెన్స్ అండ్‌క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసుపై సస్పెన్షన్ పడింది. అతని పేరు నుంచి నియామకం జరిగిన తీరు, విద్యార్హతలపై ఉన్న వివాదాలు, సర్వీసు రికార్డులో ఉన్న ఫోర్జరీ సంతకాల ఆరోపణలు వెరసి అతడిపై కొంతకాలంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చే నడుస్తోంది. అతని వ్యవహారంలో జరిగిన అక్రమాలపై 'సాక్షి' కొంతకాలంగా ఆధారాలతో వరుసగా పరిశోధనాత్మక కథనాలు అందిస్తోంది. ఈ కథనాలపై స్పందించిన హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం ఆదివారం సాయంత్రం అతడిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్ని విచారణలు వేసినా..

కట్టా విష్ణువర్ధన్‌పై సాక్షి కథనాలతో హైదరాబాద్‌లోనీ ఈఎన్‌సీ కార్యాలయం అతనిపై జనవరిలోనే విచారణకు ఆదేశించింది. అయితే ఆ జిల్లా అధికారులు విచారణ చేసిన నివేదిక సమర్పించినా.. దానిపై ఎలాంటి ముందడుగూ పడలేదు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ మైనార్టీ ఉద్యోగి చక్రం తిప్పి విచారణపై చర్యలు తీసుకోనివ్వలేదని ఉద్యోగులంతా ఆరోపిస్తున్నారు. గతంలోనూ తాము కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సమయంలోనూ సదరు విశ్రాంత అధికారి విచారణను అడ్డుకున్నాడని మండిపడుతున్నారు. అయితే 'సాక్షి'లో అతని విద్యార్హతలు, సర్వీసు రికార్డులో సంతకాల ఫోర్జరీ విమర్శల వరకు అన్ని ఆధారాలతో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో ఇటీవల సచివాలయంలో విచారణ చేపట్టారు. అక్కడా విచారణ ప్రభావితమైందన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో కొందరు సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు విషయాన్ని చేరవేశారని, జాప్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే ఈఎన్‌సీ కార్యాలయం కట్టా విష్ణువర్ధన్‌పై సస్పెన్షన్ వేటు వేసిందని సమాచారం.

నిర్మల్ నుంచి ప్రత్యేకాధికారి..

కట్టా విష్ణువర్ధన్ ఆదినుంచి వివాదాస్పద అధికారే. అతడి గురించి తెలుసుకున్న ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఆర్డర్స్‌ను జాగ్రత్తగా అతడికి చేరవేశారు. సాధారణ ప్యూన్‌లు, క్లర్కులు, ఇతర ఉద్యోగులతో ఇచ్చి పంపిస్తే విష్ణువర్ధన్ తీసుకునే అవకాశాలు తక్కువ అని ముందే గ్రహించిన ఉన్నతాధికారులు ఏఈ ర్యాంకు అధికారితో ఆదివారం ఆదేశాలను పంపించారు. నిర్మల్ సబ్ డివిజన్‌లో పనిచేసే సదరు అధికారి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలను పట్టుకుని సెలవుదినమైనప్పటికీ ఆదివారం కరీంనగర్ చేరుకున్నారు. 'కట్టా'ను ఆఫీసుకు పిలిపించి సస్పెన్షన్ ఆర్డర్స్‌ను అందజేసి, అతనితో రిసీవ్ కాపీ మీద సంతకాలు కూడా తీసుకుని వెళ్లారు. అతనిపై క్రమశిక్షణ చర్యలు కొలిక్కి వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు అమలవుతున్న కాలంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని వీడకూడదని స్పష్టం చేశారు.

ఏం జరిగింది..?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు 2 మార్చి 1967లో జన్మించాడు. అతడి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకటనాగరత్నాచారి మరణించారు. తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవపూర్‌లో గ్రేడ్‌–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ 01 ఫిబ్రవరి 1956గా ఉంది. కానీ, విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో 02 మార్చి 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడంటూ అందరి కళ్లకు గంతలు కట్టాడు. నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద నాన్ టెక్నికల్ పోస్టులో చేరాల్సిందిగానీ అతను టెక్నికల్ పోస్టులో చేరడం గమనార్హం. అతని సర్వీసు రికార్డులో ఉన్న సంతకాలు ఫోర్జరీ అన్న ఆరోపణలు దుమారానికి కారణమయ్యాయి. తన సర్వీసులో పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్లలో అనేకచోట్ల పనిచేసిన ఇతను ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు.

సాలరీ రికవరీ చేయాలి



కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో ఏళ్లుగా వివాదం సాగుతోంది. 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కప్పిన అతనిపై సస్పెన్షన్ వేటు పడటం శుభపరిణామం. అక్రమంగా విధుల్లో చేరిన అతడిని సర్వీసు రిమూవల్ చేసి, అతనికి ఇంతకాలం ప్రభుత్వం అందజేసిన సాలరీని అధికారికంగా రికవరీ చేయాలి. అతనిపై క్రిమినల్ కేసులు బుక్ చేసి, అరెస్టు చేయాలి.
– ఆమీర్, సామాజిక కార్యకర్త

క్లుప్తంగా

ముగిసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కోచింగ్



విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్‌లో విక్టరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్ కోచింగ్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల క్రాఫ్ట్స్ తయారు చేశారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, పేయింటింగ్స్, డ్రాయింగ్స్, ఫ్లవర్ మేకింగ్ తదితర గృహోపకరణాలు, కళాకృతులు నేర్పించారు. చెస్ రామయ్య ఆధ్వర్యంలో 30 మందికి శిక్షణనిచ్చారు. మండల స్థాయి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి అందజేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభా పురస్కార్ సర్టిఫికెట్స్, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ పి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని నందిని కిరాణ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. షాపు యజమాని శ్రీనివాస్ భార్య శనివారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లింది. మళ్లీ సోమవారం ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉంది. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని, లోపలికి వెళ్లి చూడగా రూ.45 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, కాయిన్స్(చిల్లర డబ్బులు) కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ టీంతో వచ్చి, పరిశీలించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై విజేందర్ తెలిపారు.

10న ఏఐకేఎంఎస్ కౌన్సిల్ సమావేశం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగుండం: జూన్ 10న పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశానికి రావాలని కౌన్సిల్ జిల్లా ప్రతినిధి కొల్లూరి మల్లేశ్, ఉపాధ్యక్షుడు మేర్గు చంద్రయ్య కోరారు. ఈ మేరకు సోమవారం అంతర్గాం మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో సంబంధిత కరపత్రాలు, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అకాల వర్షాలతో రైతాంగం ఆగమైందని, వారు కష్టాల్లో ఉంటే శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడం సరికాదన్నారు. నాయకులు చంద్రయ్య, వేల్పుల సాంబయ్య, రాజకొమురయ్య, ఆలకుంట దేవయ్య, లింగంపల్లి శంకర్, మునుకుంట్ల శ్రీనివాస్, నజీరొద్దీన్, శోభన్‌బాబు తదితరులున్నారు.

మైనారిటీ గురుకులాల్లో టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేసేందుకు ఆసక్తి, అర్హత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అధికారి మెహరాజ్ మహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల, కళాశాలల్లో అన్ని సబ్జెక్టులు టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులకు దరఖాస్తులను వారం రోజుల్లోగా సమర్పించాలని సూచించారు.

పచ్చిరొట్టకు సమయమిదే..

- జిల్లాలో 4,018 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు
- 200 క్వింటాళ్ల జనుము విత్తనాలు
- రెండున్నర ఎకరాలకు 30 కిలోలు వేయాలి
- ఎకరం సాగుచేస్తే 3 టన్నుల ఎరువు ఉత్పత్తి


లోకపేటలో సాగు చేసిన పచ్చిరొట్టను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): రోహిణికార్తె ప్రవేశించింది. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో జిల్లాకు చెందిన రైతులు వానాకాలం పంటలకు సన్నద్ధం అవుతున్నారు. అధిక దిగుబడులు, భూసారం పెంచుకునేందుకు జీలుగ, జనుము విత్తనాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాలతోపాటు ఇతర ప్రాంతాల్లో జీలుగా విత్తనాలు 4,018 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 200క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి.

పచ్చిరొట్టతో భూమి సారవంతం

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతమవుతుంది. సేంద్రియ, రసాయన ఎరువులు వాడే అవసరం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు జీలుగసాగుపై దృష్టిసారించారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ అధికారులు జీలుగ, జనుము విత్తనాలు తెప్పించి మండలాలకు సరఫరా చేశారు. జీలుగ 30కిలోల బస్తాకు రూ.843 పలుకుతోంది. డీసీఎంఎస్, ఆగ్రోస్‌లలో, సహకారసంఘాల కార్యాలయాల్లో బస్తాలు అందుబాటులో ఉన్నాయి. వరిసాగుకు నెలరోజుల ముందు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి.

దుక్కిదున్ని వేసుకోవాలి

ఎకరాకు 15కిలోల జీలుగ విత్తనాలు అవసరం ఉంటాయి. 30కిలలోల బస్తాను రెండున్నర ఎకరాల్లో చల్లుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. వరినారు పోసే 10రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మురిగిపోయి భూసారం పెరుగుతుంది. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుంది. తుంగ, గరిక లాంటి మొక్కలను నివారిస్తుంది. జీలుగను తేలికపాటి నేలల్లో, ఇసుక, చౌడు భూముల్లోనూ సాగు చేసుకోవచ్చును. చౌడు భూముల్లోని లవణాలను తీసివేసి, మంచి భూమిగా తయారు చేయడంలో సాయంగా ఉంటుంది. జీలుగా నుంచి ఎకరాకు 3టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 30 నుంచి 35రోజుల వ్యవధిలో భూమిలో కలియ దున్నాలి. మొక్కలకు 2శాతం నత్రజని, సూపర్ పాస్ఫేటు అదనంగా అందించడంతో పాటు జింకు, మాంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మాదాతువులను పంటకు చేకూర్చుతాయి. జనుము ఎకరాకు 15కిలోల విత్తనాలు అవసరం. 3 నుంచి 4టన్నుల ఎరువు ఇస్తుంది. వీటిని పొలంలో కలియదున్ని, మురిగిన తర్వాత నాటువేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు ఆసక్తి చూపుతున్నారు



రైతులు పచ్చిరొట్ట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయబావుల్లో నీరు ఉన్నవారు ఇప్పుడు విత్తనాలు వేసుకోవచ్చు. నీటి వసతి లేని రైతులు వర్షాలు కురిసిన తర్వాత వేసుకోవచ్చు. జీలుగసాగుపై గ్రామాల్లో క్లస్టర్‌వారీగా ఏఈవోల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.ఉమాపతి, ఏవో, ఎలిగేడు

సేవకు భక్తి మార్గమే మూలం


సహస్ర కలశ పూజలో ఎమ్మెల్యే చందర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- అయ్యప్ప పంచలోహ విగ్రహ పునఃప్రతిష్టాపన

యైటింక్లయిన్‌కాలనీ/గోదావరిఖని(రామగుండం): సేవకు భక్తి మార్గమే మూలమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన పంచలోహ విగ్రహ పునఃప్రతిష్టాపనోత్సవానికి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఅయ్యప్ప స్వామివారి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలని వేడుకున్నారు. అనంతరం సజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో సహస్ర కలశపూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, స్వామి వారికి 1,008 కలశాలతో మహా కుంభాభిషేకం జరిపారు. అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహాన్ని అందించిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీవారు కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్–మనాలి దంపతులు హాజరై, పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజి రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్, నరేష్, శ్రీను, ఆలయ ప్రధాన గురుస్వామి అద్దెంకి శ్రీసారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అందరి ఆమోదంతోనే అధ్యక్షుడినయ్యా..



మాట్లాడుతున్న అశోక్‌కుమార్ , రాంరెడ్డి, పక్కన రైస్‌మిల్లర్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అందరి ఆమోదంతోనే తాను రైస్ ఇండస్ట్రీస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడినయ్యానని నగునూరి అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాను 2008లో జిల్లా అసోసియేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నూతన కార్యవర్గాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎన్నుకుంటున్నామని తెలిపారు. ఈసారి తనను అధ్యక్షుడిగా ప్రతిపాదిస్తూ 73 మంది రైస్‌మిల్లర్లు తీర్మానించారని తెలిపారు. గత 30 ఏళ్లుగా రైస్ మిల్లర్ల సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నానని, తన పని తీరు చూసే వారికి తెలుసన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాడూరి ప్రసాద్ తదితరులున్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నుకుందాం..

బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ పెట్టి, అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు రైస్‌మిల్లర్లు కలిసిరావాలని మరో రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడవల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. అసోసియేషన్ పూసాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లు మోరపల్లి తిరుపతిరెడ్డి, మినుపాల ప్రకాశ్‌రావు, ఎర్రబెల్లి గోపాల్‌రావు, పురుషోత్తంరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు సంఘాలు..

జిల్లాలో బాయిల్డ్ మిల్లర్లు రెండు సంఘాలుగా విడిపోయి జిల్లా అధ్యక్షులుగా ఇద్దరు కొనసాగుతున్నారు. ఒకే సంఘం కావాలని పలుమార్లు ప్రయత్నించినా కాకపోవడంతో రా రైస్ మిల్లర్ల సంఘం ప్రత్యేక కమిటీని ఇటీవల ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మిల్లర్లు మూడు సంఘాలుగా ఉన్నట్లయింది. ఎవరికివారే తమ ఆధిపత్యం నడవాలని కోరుకుంటున్నారని, అందువల్ల ఒకే సంఘం ఉండటం సాధ్యమయ్యే పని కాదని పలువురు మిల్లర్లు అభిప్రాయపడుతున్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి అతి సమీపంలో ఉన్న రాఘవాపూర్‌లో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి చట్టవిరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిలారపు పర్వతాలు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కుమారస్వామి, నాయకుడు తాడిచెట్టి శ్రీకాంత్‌లు ఆరోపించారు. గ్రామంలో సోమవారం వారు మాట్లాడారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్ నిబంధనలు పాటించని ప్లాట్లలో ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని పంచాయతీ కార్యదర్శిని లిఖితపూర్వకంగా కోరారు. ఈ విషయమై కలెక్టర్, సబ్‌రిజిస్ట్రార్‌లకు కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

రక్తకణాలపై తప్పుడు రిపోర్ట్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ల్యాబ్‌లో ఆదివారం రాత్రి రక్తపరీక్ష చేయించుకుంటే రక్తకణాలు 23 వేలకు పడిపోయాయని తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని పెద్దపల్లి మండలంలోని కాపులపల్లికి చెందిన శనిగరపు సాయికుమార్ వాపోయాడు. పేట్‌లెట్స్ ఎక్కించాలంటూ భయభ్రాంతులకు గురిచేశారని తెలిపాడు. ఈ విషయాన్ని తన కుటుంబీకులకు చెప్పడంతో వారు సోమవారం పట్టణంలోని మరోచోట పరీక్షలు చేయించగా 1.23 లక్షలు ఉన్నట్లు రిపోర్ట్ ఇచ్చారన్నాడు. ఇదేంటని ఆ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడిని అడిగితే ఎవరికైనా ఫిర్యాదు చేసుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని అన్నాడు. దీనిపై డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని బాధితుడు పేర్కొన్నాడు.

రైలు ఢీకొని వలస కార్మికుడి మృతి

పెద్దపల్లిరూరల్: రైలు ఢీకొని ఓ వలస కార్మికుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని మహాగావ్‌కు చెందిన నారాయణదుర్గే(45) పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో తన భార్య గోపిక దుర్గేతో కలిసి రెండేళ్లుగా నివాసం ఉంటున్నాడు. స్థానికంగా తాపీమేస్త్రీగా పని చేస్తున్న ఆయన సోమవారం బహిర్భూమికి వెళ్లి, రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణదుర్గే అక్కడికక్కడే మృతిచెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

- ఆర్జీ–3 సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీదేవి


శ్రీదేవిని సన్మానిస్తున్న సేవా సభ్యులు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీదేవిని సోమవారం సెంటినరీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో సేవా సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల వృత్తి శిక్షణలను నేర్చుకోవాలన్నారు. ఈ సమితికి తక్కువ కాలమే అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ అందరితో కలిసి చేసిన మంచి పనులు జీవితకాలం గుర్తుంటాయని తెలిపారు. 13 బ్యాచ్‌లలో 390 మందికి వివిధ రకాల వృత్తి శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని, తమ కుటుంబాలకు అండగా నిలవాలని చెప్పారు. అనంతరం సెంటనరీకాలనీలోని రాణీ రుద్రమ క్రీడా మైదానంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మహిళలు, పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైపీఎం మారుతి, సేవా సభ్యులు మల్లీశ్వరి, ఆస్మా, శిక్షకులు పద్మ, అశ్విని, సంధ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి


అధికారులతో మాట్లాడుతున్న జీఎంలు వెంకటేశ్వర్‌రావు, మనోహర్, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 డివిజన్ పరిధిలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో సంబంధిత అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 21 రోజుల వరకు జరిపే సంబురాలు పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉండాలన్నారు. కాలనీల ప్రధాన కూడళ్లను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సామూహిక భోజనాలకు ఏర్పాట్లు చేయాలని, ఉత్తమ ఉద్యోగులను సన్మానించాలని సూచించారు. అధికారులు ఎలీషా, రాధాకృష్ణ, బైద్య, రఘుపతి, శ్రీనివాసులు, వెంకటరమణ, జైనుల్లాబుద్దీన్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాగర్జన సభకు తరలిరావాలి


కార్మికులతో మాట్లాడుతున్న ఎల్లాగౌడ్

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం జీడీకే–1 ఇంక్లయిన్‌లో కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 11వ వేజ్‌బోర్డు ఒప్పందం పరిష్కారంలో ఏఐటీయూసీ కృషి ఎంతో ఉందన్నారు. కార్మికులకు లాభం చేకూర్చే ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటు వారికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాగర్జన బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు ఎంఏ.గౌస్, శ్రీనివాస్, రాజేశ్, తిరుపతి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–1, 3 ఇంక్లయిన్ గనుల సందర్శన


డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ జీడీకే–1, 3 ఇంక్లయిన్ గనులను జీఎం చింతల శ్రీనివాస్, అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షణతో కూడిన నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత, మ్యాన్ పవర్, యంత్రాల వినియోగం తదితర అంశాలపై సూచనలు చేశారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ బానోతు సైదులు, ప్రభాకర్, సర్వే అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎండలో పని చేయించడం సరికాదు'


ఎండలో పని చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): మండే ఎండలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులతో పని చేయించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా రోడ్లమీద గుంతలు పూడ్చడానికి, కంకర, సిమెంట్ నింపడానికి వాడుకోవడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. రోడ్లకు మరమ్మతు చేయాల్సిన బాధ్యత ఆర్‌అండ్‌బీ శాఖదని, సంబంధిత కాంట్రాక్టర్లతోనే పని చేయించుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో పని వేళల్లో మార్పు జరిగినా శానిటేషన్ సిబ్బందితో సంబంధం లేని పనులే ఎక్కువ చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ విధానాన్ని మానుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రహదారి విస్తరణ పనుల అడ్డగింత


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని సంజయ్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణ పనులను 11వ డివిజన్ ప్రజలు స్థానిక కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విప్రకాశ్ నేతృత్వంలో సోమవారం అడ్డుకున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి సతీశ్‌తో వాగ్వాదానికి దిగి, ఆందోళన చేపట్టారు. స్థానికుల నివాసాలకు నష్టం కలగకుండా 40 ఫీట్ల వరకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో వన్‌టౌన్ 2వ సీఐ ప్రసాదరావు మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన కలవల కొమురయ్య, బొడ్డు రాజేశం, ఈగ సంపత్, భూపాల దుర్గయ్య, కలవల రాఘవులు, శనివారపు రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.





లాల్‌బహదూర్ స్టేడియంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు

చీఫ్ మినిస్టర్స్ కప్.. మనోళ్ల మార్చ్‌ఫాస్ట్

కరీంనగర్ స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్స్ కప్–2023 రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ముందుగా జరిగిన మార్చ్‌ఫాస్ట్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులు తమ జట్ల ఫ్లాగ్‌లతో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.